## క్లుప్తంగా...

### నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

**మణికొండ:** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 3,5,14 వార్డులలో రూ.6.95 కోట్లతో చేపడుతున్న సీసీ, బీటీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణాల ప్రారంభోత్సవానికి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరవుతున్నార న్నారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కోకాపేట శాంతినగర్ కాలనీ నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారికి జైలు

**శంషాబాద్:** మద్యం తాగి వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఇతరత్రా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన 38 మందిని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో సోమవారం హాజరుపర్చారు. వీరిలో 11 మందికి కనిష్టంగా ఒకరోజు, గరిష్టంగా ఐదు రోజుల జైలుశిక్షను న్యాయమూర్తి విధించారు. మిగిలిన వారికి కూడా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

### అభినందన



అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి

**అత్తాపూర్:** విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ సంరెడ్డి సురేందర్ అన్నారు. డీసీఎంఈ బ్రాంచీ విద్యార్థి చంద్రహాస్ ఈ–సెట్‌లో 82వ ర్యాంకు సాధించిన సందర్భంగా కళాశాల సెక్రటరీ, ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.వీ.శంకర్‌రామ్‌లు సోమవారం చంద్రహాస్‌ను అభినందించారు.

### గోల్కొండ జోన్ సదర్ ఖాజీగా అలీమొద్దీన్



**గోల్కొండ:** గోల్కొండ జోన్ ప్రభుత్వ సదర్ ఖాజీగా ఖాజీ మహ్మద్ అలీమొద్దీన్ బైజిద్ హుస్సామి నియమితులయ్యారు. ఆయన రెండు దశాబ్దాలుగా ఖాజీగా విధులు నిర్వహిస్తున్నారు. గోల్కొండలోని సదర్ ఖాజీగా ఆయనను నియమిస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సందర్భంగా మహ్మద్ అలీమొద్దీన్ బైజిద్ హుస్సామి మాట్లాడుతూ.. వధూవరులకు ఇస్లామి పద్ధతిలో నిఖా చేయడమే తన లక్ష్యమన్నారు. గోల్కొండ జోన్ ఏరియాలో లంగర్‌హౌస్, వార్డు 9, 13, గోల్కొండ ఈస్ట్‌లో వార్డు 9, గోల్కొండ వెస్ట్‌లో వార్డు 9లోని 4, 5, 6, 10 బ్లాకులు వస్తాయని ఆయన అన్నారు.

### పిడుగుపాటుతో కాలిపోయిన గృహోపకరణాలు

**అత్తాపూర్:** అత్తాపూర్ వాసుదేవ్‌రెడ్డి నగర్‌లోని ఓ నాలుగు అంతస్తుల భవనంపై సోమవారం రాత్రి పిడుగు పడింది. ఈ సంఘటనలో బిల్డింగ్‌లోని 15 నివాసాలలోని విద్యుత్ గృహ ఉపకరణాలు కాలిపోయాయి. వాసుదేవరెడ్డి నగర్‌లో దీప్‌రాజ్ జైస్వాల్ నాలుగు అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మించాడు. ఇందులో 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. సోమవారం సాయంత్రం మిద్దెపై పిడుగు పడడంతో పాక్షికంగా ప్రహరీ ధ్వంసం కాగా...ఇళ్లల్లోని టీవీలు, రిఫ్రిజిరేటర్లు, సీసీ కెమెరాలు ఇతర విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. దాదాపు 25 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని అపార్ట్‌మెంట్ వాసులు వాపోయారు.

### నూతన డీసీని కలిసిన కార్పొరేటర్



**రాయదుర్గం:** శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రజినీకాంత్‌రెడ్డిని సోమవారం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. డీసీ స్పందిస్తూ త్వరలోనే అన్ని శాఖల అధికారులతో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. అనంతరం గంగాధర్‌రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఈఈని కార్పొరేటర్ కోరారు. డీఈ శ్రీనివాస్, నాయకులు శ్రీరాములు, నర్సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

# వ్యర్థాల పారబోతపై అవగాహన కల్పించాలి

**రాజేంద్రనగర్:** పరిసరాల శుభ్రత కోసం అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వాములను చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ సూచించారు. సోమవారం రాజేంద్రనగర్, ఎన్ఐఆర్‌డీ, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో ఏఎంహెచ్ఓ కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యర్థాలను రోడ్లు, ఓపెన్ పాయింట్ల వద్ద పారవేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు వ్యర్థాల పారబోతపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు. చెత్తను చెత్తసేకరణ ఆటోలకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. జీవీపీ పాయింట్లను పూర్తిగా ఎలిమినేట్ చేయాలన్నారు. జీవీపీ పాయింట్ల వద్ద చెత్తచెదారాలు పేరుకుపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుర్గంధంతో రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. అధికారులు ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తూ పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినాయక్‌నగర్‌లో బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఉపకమిషనర్ రవికుమార్

### అభివృద్ధి పనుల పరిశీలన

**రాజేంద్రనగర్:** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రతి బస్తీ కాలనీని అభివృద్ధి చేసేందుకు పర్యటిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ విప్‌సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించి పరిశీలించారు. వినాయక్‌నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పైపులైన్‌లు, వీధిదీపాలు, ఆర్‌జీకే క్వార్టర్స్‌లో నూతన బోర్, తాగునీటి సమస్యలు, ఆప్కో కాలనీలో సీసీరోడ్లు పనులను తదితర అభివృద్ధి, పార్కు సుందరీకరణ పనులను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈఈ నాగేందర్‌గౌడ్, డీఈ శంకర్, ఏఈ బల్వంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, భాను, జలమండలి అధికారులు జమీల్, సూపర్ వైజర్ వినయ్, లోక్‌నాథ్, స్ట్రీట్ లైట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ మహేందర్, డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్, బుచ్చిరెడ్డి, ఎల్.వీ.రెడ్డి, నర్సింగ్, ప్రదీప్, నవీన్, అంజమ్మ, సంగీత, చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, రాకేష్, రాజేష్, మనోజ్, జనార్దన్, శ్రీనునాయక్ ఉన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**రాజేంద్రనగర్:** తెలంగాణ రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా జరిగాయి. సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ వెంకటేష్, మైలార్‌దేవ్‌పల్లి యువజన బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, యూత్ అధ్యక్షులు రాఘవేందర్, సరికొండ వెంకటేష్, సోమ శ్రీనివాస్‌గుప్తా, శ్రీను, కార్తీక్, రామకృష్ణ, మల్లేష్, యాదగిరి, స్వామిగౌడ్, జగదీష్ తదితరులున్నారు.

### అన్నదానం..

- డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నీలోఫర్ ఆసుపత్రి వద్ద 500 మందికి అన్నదానం చేశారు. డివిజన్ యూత్ లీడర్ కాటి దేవేందర్, రియాజ్ అలీ, జాఫర్, అశ్వక్, మహమ్మద్ ఇద్రీస్, జనార్దన్, సాయి, సోయాబ్‌ఖాన్, హరీష్ తదితరులున్నారు.
- **మణికొండ:** మణికొండ మున్సిపాలిటీ పంచవటీ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు శైలజావినోద్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్‌లతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, వైస్‌చైర్మన్ జి.వెంకటేష్‌యాదవ్, కమిషనర్ సురేందర్‌రెడ్డిలు మొక్కలు నాటారు. కౌన్సిలర్లు జి.శివారెడ్డి, ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, నాయకులు గోపాలగణేష్, నీలేష్‌ప్రసాద్, విష్ణువర్దన్ రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.
- వట్టినాగులపల్లిలోని ఎస్ఓఎస్ అనాథాశ్రమంలో విద్యార్థులతో కేక్‌కట్ చేయించి వారికి పండ్లు పంచిపెట్టారు.
- **శంషాబాద్:** పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ప్రజాసేవలో ఆయన చిరకాలం ఉండాలని భగవంతున్ని ప్రార్థించినట్లు ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్లు మేకల వెంకటేష్, అశోక్, నాయకులు జిట్ట సిద్దులు, శ్రీనివాస్, సంతోష్, ప్రవీణ్‌గౌడ్, జీవై ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తీర్థయాత్రకు ప్రణవ భక్త సమాజం



ప్రణవ భక్త సమాజం సభ్యులు

**అత్తాపూర్:** హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులంతా కలిసి తీర్థయాత్రకు బయలుదేరారు. పండరీపురం, కొల్లాపూర్ మహాలక్ష్మి శక్తిపీఠం, భీమశంకర్ జ్యోతిలింగం, నాసిక్ త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, షిర్డీ, గ్రిష్మేశ్వర్ జ్యోతిర్లింగం, తుల్జాపూర్‌లను సందర్శించారు. పార్టీలకు అతీతంగా దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ దేశంలోని వివిధ ప్రాంతాల ఆలయాలను దర్శించుకుంటున్నామన్నారు. కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, మధుసూదన్, ఎం.జయవంత్‌రావు, ఎం.రాము, నారగూడెం మల్లారెడ్డి, మోండ్ర కొమురయ్య, నర్సింహ్మా, అయిలయ్య, అశోక్, బర్ల మల్లారెడ్డి, హరినాథ్, నర్సింహ్మ, జయానందరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శివరాజ్, సహదేవ్‌రెడ్డి, కె.రాజు, శెట్టిగారి శేఖర్ తదితరులున్నారు.

### శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని వినతి



నార్సింగి కమిషనర్ సురేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ ఉషారాణి

**మణికొండ:** నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న వీరశైవలింగాయత్‌ల శ్మశానవాటికలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ ఉషారాణి కమిషనర్ సురేందర్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటికలో స్నానాల గదులు, నీటి సౌకర్యం, వీధిదీపాలు, ప్రహరీగోడలను నిర్మించాలని కోరారు. చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధ భరితంగా మారిందని దాన్ని పరిశుభ్రంగా మార్చాలని కోరామన్నారు. మంగళవారం పరిశీలించి దానికను గుణంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారని కౌన్సిలర్ తెలిపారు.

# టోర్నమెంట్ విజేత ఎఫ్‌సీసీ శంషాబాద్ జట్టు

**శంషాబాద్:** ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంటు సీజన్–31 ఛాంపియన్‌గా ఎఫ్‌సీసీ శంషాబాద్ జట్టు నిలిచింది. ఎంపీఎస్ క్రికెట్ మైదానంలో గత 4 రోజులుగా జరిగే క్రికెట్ టోర్నమెంటు పోటీల్లో సోమవారం జరిగిన ఫైనల్‌మ్యాచ్ ఎఫ్‌సీసీ, ఎఫ్‌సీసీ శంషాబాద్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఎఫ్‌సీసీ శంషాబాద్ జట్టు 131 పరుగులు సాధించగా.. 132 పరుగుల లక్ష్యంతో దిగిన ఎఫ్‌సీసీ జట్టు 109 పరుగులు సాధించి ఆలౌటైంది. ఎఫ్‌సీసీ శంషాబాద్ జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ మాదిరెడ్డి శివారెడ్డి విన్నర్ ట్రోఫీని అందుకున్నారు. ఎఫ్‌సీసీ శంషాబాద్ జట్టును క్రీడాభిమానులు, స్థానికులు, ప్రజాప్రతినిధులు రాజకీయ నేతలు అభినందించారు. జట్టు సభ్యులు సాయిజ్యోతి కృష్ణ, సుశాన్, సమీర్, నాయక్, అబిద్, అక్తాఫ్ నిర్వాహకులు వెంకట్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.





ట్రోఫీని అందుకుంటున్న ఎఫ్‌సీసీ శంషాబాద్ జట్టు కెప్టెన్ శివారెడ్డి





### విఫాకప్‌లో రాణించిన క్రీడాకారులు

**మణికొండ:** బెంగుళూరు కేంద్రంగా జరిగిన 5వ జాతీయ తైక్వాండో విఫా కప్ చాంపియన్ షిప్‌లో మణికొండ క్రీడాకారులు రాణించారు. ఈనెల 20 నుంచి 24 వరకు జరిగిన పోటీల్లో 4 స్వర్ణ పతకాలు, రెండు రజతం, మూడు కాంస్య పతకాలను సాధించినట్లు మణికొండ విక్టరీ తైక్వాండో అకాడమీ కోచ్ వెంకటేష్ తెలిపారు. మణికొండ మౌంట్‌లిటేరా జీ స్కూల్ చైర్మన్ కె. భాస్కర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

**రాజేంద్రనగర్:** కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. ఏఐసీసీ నూతన కార్యదర్శిగా నియమితులైన మన్సూర్ అలీఖాన్‌ను సోమవారం గాంధీభవన్‌లో షమీమ్‌ఖురేషి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌లు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులపై ఉందన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మన్సూర్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

### తప్పిపోయి.. పోలీసుల చెంతకు చేరి..

మూడేళ్ల చిన్నారిని చేరదీసిన పోలీసులు



తప్పిపోయిన బాలుడు

**అత్తాపూర్:** ఓ బాలుడు తప్పిపోయి ఏడుస్తూ తిరుగుతుండటంతో అత్తాపూర్ పోలీసులు చేరదీశారు. ఎస్సై కిషన్‌జీ బాలుడి వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. మూడేళ్ల బాలుడు సోమవారం ఉదయం అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 139 వద్ద ఏడుస్తూ తిరుగుతున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని బాలుడితో మాట్లాడారు. వివరాలు సేకరించేందుకు ప్రయత్నించగా.. బాలుడి పేరు సేతూ అని మాత్రమే చెబుతున్నాడు. తల్లిదండ్రుల వివరాలు, పేర్లు చెప్పలేకపోతున్నాడు. చుట్టు పక్కల ప్రాంతాల్లో బాలుడి తల్లిదండ్రుల కోసం వాకబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదని తెలిపారు. బాలుడి వివరాలు వివిధ వాట్సప్ గ్రూప్‌లలో పోస్టులు చేశారు. బాలుడికి సంబంధించిన వారు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఆచూకీ లభిస్తే 8331013203, 8712663419 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

# ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. సోమవారం కార్పొరేషన్ 5వ డివిజన్‌లోని సౌభాగ్యనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఉన్న తాత్కాలిక డంపింగ్ యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని దీనిని ఇతర ప్రాంతానికి తరలిస్తామన్నారు. ఎస్ఎంపీ ప్రధాన రహదారిలో డ్రైనేజీ పొంగిపోర్లుతుందని నూతన పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాక్‌చర్చి, కిస్మత్‌పూర్‌లో రోడ్డు గోతులమయంగా మారిందని దీనిని పరిష్కరించేందుకు నూతన రోడ్డును వేస్తామని ప్రకటించారు. ప్రజలు చెత్తను ఇష్టానుసారగా పారవేయొద్దని చెత్త సేకరణ కార్మికులకు అందించాలని అవగాహన కల్పించారు.



సౌభాగ్యనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

# లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు



లోతట్టు ప్రాంతంలోని వారితో మాట్లాడుతున్న కార్పొరేటర్

**రాయదుర్గం:** ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఇబ్బందులు పడ్డ లోతట్టు ప్రాంతాల్లో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సోమవారం పర్యటించారు. టెలికామ్‌నగర్‌లో శివారు బస్తీలో వరద ముంపు ప్రాంతాల్లో ఆయన జీహెచ్ఎంసీ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు, రోడ్లపై పేరుకపోయిన వ్యర్థాలు, కాలువల్లో సాఫీగా నీటిపారుదల అడ్డంకులను జేసీబీతో తొలగించే పనులను పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి ఆయన మాట్లాడి వారికి భరోసా ఇస్తూ పూర్తిగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టెలికామ్‌నగర్ ప్రాంతంలో రోడ్లపై వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మురుగు, వరద నీటికాలువలు, నాలాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించాలని కోరారు. మాన్‌సూన్ టీమ్ ద్వారా అన్ని చర్యలు తీసుకొని ప్రజలు ఇక్కట్లు పడకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీరాములు, నర్సింగ్ నాయక్, స్థానికులు పాల్గొన్నారు.

# విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు

**అత్తాపూర్:** వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలకుండా ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నీటిని చాలాకాలం మూతలు లేకుండా నిల్వ ఉంచినట్లయితే క్రిమి కీటకాలు చేరి ప్రమాదం బారిన పడే అవకాశం ఉందన్నారు. మురుగును ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, ఇతర విషజ్వరాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ అధికారులకు సూచించారు. సీనియర్ ఎంటమాలజీ జోనల్ అధికారి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంటమాలజీ విభాగం అధికారులతో కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్

# హెచ్‌సీయూలో గుర్రంజాషువా వర్ధంతి



వేడుకల్లో వీసీ ప్రొఫెసర్ సర్రాజు, హెచ్‌సీయూ ఆచార్యులు

**రాయదుర్గం:** కులమతాలులేని విశ్వమానవతను ఆకాంక్షించిన కవులలో ఒకరు గుర్రం జాషువా అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్ఎస్ సర్రాజు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగు విభాగంలో తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో గుర్రంజాషువా 51వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాషువా భారతీయ సంస్కృతిని, దానిలో తెలుగు వారి ప్రత్యేకతలను వివరించిన వ్యక్తి అని గుర్తుచేశారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గుర్రం జాషువా భారతమాత గురించి వర్ణించినంత ఔన్నత్యాన్ని మరేకవి వర్ణించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు గోనానాయక్, పమ్మిపవన్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బోనాలు సంస్కృతికి ప్రతీక





మాట్లాడుతున్న సినీ నటి రాగిణి

**గచ్చిబౌలి:** బోనాల పండగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పలువురు ప్రముఖులు అన్నారు. సోమవారం సైఫాబాద్‌లోని కళాభవన్‌లో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమి ఆధ్వర్యంలో తెలంగాణ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాట్య గురువులకు తెలంగాణ కిరణం అవార్డులను అందజేశారు. అంతకు ముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటి రాగిణి, నృత్య గురువు డాక్టర్ టి.సందీప్, ఫిట్‌నెస్ నిపుణులు అణుప్రసాద్, ఎన్‌సీసీ అధికారి మేజర్ వి.జయసుధ, సంస్థ వ్యవస్థాపకురాలు విజయమాధవి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా శ్రావణ సోమవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి

**రాయదుర్గం:** శ్రావణ మాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలను నిర్వహించారు. అందులో భాగంగా ఆలయంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసిన తర్వాత ప్రత్యేక అలంకారం చేశారు. గౌలిదొడ్డిలోని శివాలయంలో కూడా సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

# కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతి

**గచ్చిబౌలి:** గచ్చిబౌలి ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతించారు. సోమవారం రాత్రి సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్దన్ వాహనాల రాకపోకలకు ప్రారంభించారు. గచ్చిబౌలి జంక్షన్‌లో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ రోడ్డులో రాడిసన్ హోటల్ వరకు లెవల్–2 ఫ్లైఓవర్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. నిర్మాణ పనులకు అంతరాయం కలుగకుండా, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో మే 13 నుంచి కొండాపూర్ రోడ్డులో రెండు వైపుల వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆగస్టు 10వ తేదీ వరకు గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొత్తగూడ వైపు వెళ్ల రోడ్డును రెండు వైపులా మూసివేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించినా తాజాగా గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వైపు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతించారు. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు వాహనాల రాకపోకలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న మళ్లింపు కొనసాగనుంది.